క్లుప్తంగా

29న ప్రమాణ స్వీకారం



మాట్లాడుతున్న ధర్మాన కృష్ణచైతన్య

నరసన్నపేట: ఈ నెల 29వ తేదీన నరసన్నపేట నియోజవకర్గ, పార్టీ మండల అనుబంధ సంఘాల అధ్యక్షులు, కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారం జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న మేఘన కన్వెన్షన్ హాల్‌లో నిర్వహిస్తున్నట్లు పోలాకి జెడ్పీటీసీ ధర్మాన కృష్ణచైతన్య తెలిపారు. నరసన్నపేట పట్టణంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం స్థానిక నాయకులతో కలిసి సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ, శ్రీకాకుళం పార్లమెంటరీ నియోజకవర్గ పరిశీలకులు కుంభా రవిబాబు, మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్ హాజరవుతారన్నారు. ఈ కార్యక్రమానికి ఎంపీపీలు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అనుబంధ సంఘాల కమిటీ సభ్యులు హాజరుకావాలని పిలుపునిచ్చారు. సమీక్షలో ఎంపీపీలు ఆరంగి మురళి, వాన గోపి, పార్టీ నాయకులు చింతు రామారావు, వరుదు వంశీకృష్ణ, కేసీహెచ్‌బీ గుప్త, బగ్గు రామకృష్ణ, రాజాపు అప్పన్న, కనుసు సీతారాం, దోమ మన్మధరావు, తదితరులు పాల్గొన్నారు.

110 మందికి వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

నరసన్నపేట: మండలంలోని ఉర్లాం బీసీ బాలికల వసతి గృహం ఆవరణలో మంగళవారం ఉచిత వైద్యం ఏర్పాటు చేశారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, ఉర్లాం సర్పంచ్ పోలాకి నర్సింహమూర్తి ఆధ్వర్యంలో మెడికవర్ ఆస్పత్రి సహకారంతో వైద్య శిబిరం నిర్వహించారు. 110 మందికి వైద్య తనిఖీలు చేపట్టి 20 మందికి మెడికవర్ ఆస్పత్రికి రిఫర్ చేశారు. సుగర్, బీపీ, ఈసీజీ పరీక్షలు చేశారు. వైద్యుల సూచనల మేరకు మందులు సరఫరా చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు స్వాతి, చైతన్య, పీఆర్వో చిరంజీవి, ఉర్లాం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు సురంగి నర్సింగరావు, ఉర్లాం పార్వతీశం, నడిమింటి శాంతారావు, సతివాడ రామినాయుడు, పోలాకి రమణయ్య, పండి కృష్ణారావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు



పూజల్లో పాల్గొన్న భక్తులు

ఎల్.ఎన్.పేట: మండలంలోని పూశాం గ్రామంలో నిర్మించిన ఉమాచంద్రమౌళీశ్వర స్వామి ఆలయం ప్రారంభోత్సవం సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. బ్రహ్మశ్రీ లక్ష్మీవెంకటగౌరీ వరప్రసాద్ శర్మ ఆధ్వర్యంలోపూజలు నిర్వహించినట్లు గ్రామ పురోహితుడు నేతేటి వెంకటరమణమూర్తి తెలిపారు. పూశాంతో పాటు పరిసర గ్రామాల భక్తులు పూజల్లో పాల్గొన్నారు.

భూ సమస్య పరిష్కరిస్తాం..



గిరిజనులతో మాట్లాడుతున్న రెవెన్యూ సిబ్బంది

హిరమండలం: మండలంలోని గులుమూరు పంచాయతీ జగన్నాథపురం గ్రామంలోని భూములను రెవెన్యూ అధికారులు మంగళవారం పరిశీలించారు. గిరిజనులకు సంబంధించిన భూమి గిరిజనేతరులు ఆక్రమించుకున్నారని, భూ సమస్యను పరిష్కరించాలని గిరిజనులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రెవెన్యూ సిబ్బంది క్షేత్రస్థాయిలో పరిశీలన చేసినట్లు తహసీల్దార్ ఎస్.హనుమంతురావు తెలిపారు. భూ సమస్యను పరిష్కరిష్కరిస్తామన్నారు. ఆర్ఐ ఉమాశంకర్ ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది పరిశీలన చేస్తున్నట్లు తెలిపారు. రెవెన్యూ సిబ్బంది ఇచ్చిన నివేదికపై తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఆమదాలవలస రూరల్: మండలంలోని దన్నానపేట వద్దనున్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా ఏసీ టెక్నీషియన్, గృహ పరికరాలపై ఉచితంగా మూడు నెలలపాటు శిక్షణ అందించనున్నారు. ఈ మేరకు కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ అన్నెపు గోపి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సులలో ఉచిత శిక్షణ పొందేందుకు 10వ తరగతి, ఐటీఐ, డిప్లమో విద్యార్థులు ఈ నెల 28వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. శిక్షణ పూర్తయిన తర్వాత పరీక్షలు నిర్వహించి సర్టిఫికెట్‌ను అందజేస్తామన్నారు. వివిధ పారిశ్రామిక వాడల్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. పూర్తి వివరాలకు ఫోన్ నంబర్ 7569077449ను సంప్రదించాలన్నారు.

26 ఏళ్లుగా.. పోలీస్ స్టేషన్ లేదు!



ఎల్.ఎన్.పేట మండల కేంద్రం

- 1999లో ఎల్.ఎన్.పేట కేంద్రంగా మండలం ఏర్పాటు
- పోలీస్ స్టేషన్‌లేని ఏకైక మండలం
- పోలీస్ సేవల కోసం పక్క మండలం వెళ్లాల్సిందే..
- ఐదు ప్రభుత్వాలు మారినా కలగా మిగిలిన ఠాణా

ఎల్.ఎన్.పేట: జిల్లాలో ఎల్.ఎన్.పేట కేంద్రంగా 1999లో అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు కొత్త మండలాన్ని ఏర్పాటు చేశారు. సరుబుజ్జిలి మండలంలోని 19 పంచాయతీలను వేరు చేసి ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో 38వ మండలంగా ఎల్.ఎన్.పేట ఆవిర్భవించింది. కొత్త మండలం ఏర్పడిన తరువాత అంచెలంచెలగా రెవెన్యూ, మండల పరిషత్, గృహ నిర్మాణం, వ్యవసాయం, ఉపాధి హామీ, ఎంఎంఎస్ వంటి అన్ని శాఖల పరిపాలన తీసుకువచ్చారు. కొత్త మండలం ఏర్పడి 26 ఏళ్లు అవుతున్నా పోలీసు స్టేషన్ ఏర్పాటు కలగానే మిగిలిపోయింది.

ఏళ్లు గడిచినా..

ఎల్.ఎన్.పేట కేంద్రంగా కొత్త మండలం ఏర్పాటు చేసి 26 ఏళ్లు గడిచిపోయాయి. ఐదు ప్రభుత్వాలు మారిపోయాయి. ఈ 26 ఏళ్లలో 1999 నుంచి 2004 వరకు, 2014 నుంచి 2019, 2024 నుంచి (ప్రస్తుతం) తెలుగుదేశం ప్రభుత్వమే అధికారంలో ఉంది. అంటే చంద్రబాబు 11 ఏళ్లపాటు అధికారంలో ఉన్నారు. అయినప్పటికీ మండల కేంద్రంలో కొత్త పోలీసు స్టేషన్ ఏర్పాటు కాలేదు. 2024లో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది అవుతున్నప్పటికీ పోలీసు స్టేషన్ ఏర్పాటు ప్రక్రియ ముందుకు సాగలేదు. ఆరు నెలలుగా పోలీసు స్టేషన్ ఏర్పాటు అంటూ హడావిడి చేస్తున్నారే తప్ప.. కార్యరూపం దాల్చటం లేదు.

నేరాలు అధికమే..

సరుబుజ్జిలి పోలీసు స్టేషన్ పరిధిలో ఉన్న ఎల్.ఎన్.పేట మండలంలో సరుబుజ్జిలి మండలంతో పోల్చితే నేరాల సంఖ్య ఇక్కడే ఎక్కువగా జరుగుతున్నాయని పోలీసు రికార్డులు తెలియజేస్తున్నాయి. 35 వేల మంది జనాభా ఉన్న ఎల్.ఎన్.పేట మండలంలో 18 సమస్యాత్మక గ్రామాలున్నాయి. 26 ఏళ్లలో 12 వరకు హత్యలు, హత్యా ప్రయత్నాల కేసులు నమోదయ్యాయి. వందలాది మందిపై బైండోవర్ నమోదు చేశారు. పోలీసు స్టేషన్‌లో ఎనిమిది మంది రౌడీ షీటర్లు ఉంటే ఎల్.ఎన్.పేట మండలానికి చెందిన వారే ఐదుగురు ఉన్నారు. మండలంలో ఏదైనా నేరం జరిగితే సరుబుజ్జిలి నుంచి పోలీసులు వచ్చేసరికి సుమారు 30 నిమిషాల నుంచి గంట సమయం పడుతుంది.

అవుట్ పోస్ట్ పోలీసు స్టేషన్ ఏర్పాటు చేయాలి



శాశ్వత పోలీసు స్టేషన్ ఏర్పాటు చేయటంలో ఇబ్బందులు ఉంటే జిల్లా పోలీసు అధికారులు స్పందించి కనీసం అవుట్‌పోస్ట్ పోలీసు స్టేషన్ అయినా ఏర్పాటు చేయాలి. సరుబుజ్జిలి పోలీసు స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయాల్సి వస్తుంది. పోలీసు సేవలు ప్రజల వద్దకు తీసుకువచ్చేలా అధికారులు నిర్ణయం తీసుకోవాలి.

– లుకలాపు రాజారావు, విశ్రాంత ఉపాధ్యాయుడు, మిరియాపల్లి, ఎల్.ఎన్.పేట

రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం



- ఏడాది పాలనలో దాడులే ఎక్కువయ్యాయి
- పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి

ఎల్.ఎన్.పేట: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన ఏడాది పాలనలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులపై దాడులు పెరిగిపోయాయని పాతపట్నం మాజీ ఎమ్మెల్యే, పార్టీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యురాలు రెడ్డి శాంతి మంగళవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసినప్పటి నుంచి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ తీసుకువచ్చిన రాజ్యాంగం అమలు కావటం లేదన్నారు. చంద్రబాబు కుమారుడుకు మంత్రి లోకేష్ తీసుకువచ్చిన రెడ్‌బుక్ రాజ్యాంగం అమలవుతోందన్నారు. శాంతిభద్రతలు దిగజారిపోయాయని, పోలీసు వ్యవస్థ నిర్వీర్యం అయిందన్నారు. చంద్రబాబు తన రాజకీయ కక్ష సాధింపు కోసం పోలీసులను పావులుగా వాడుకుంటున్నారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వ అవినీతి, అక్రమాలపై ప్రశ్నించిన వారిపై బెదిరింపులతోపాటు దాడులకు తెగబడుతున్నారని, పోలీసులను ఉపయోగించుకుని తప్పుడు కేసులు బనాయిస్తున్నారన్నారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయటం లేదన్నారు.

లోకేష్ రాసుకున్న రెడ్‌బుక్‌లోని అంశాలను మాత్రమే అమలు చేస్తున్నారన్నారు. చట్టాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడాల్సిన పోలీసులు కూడా కూటమి నాయకుల కనుసన్నల్లో ఉద్యోగాలు చేస్తున్నారన్నారు. ఇచ్చిన మాట ప్రకారం సకాలంలో సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి దక్కిందన్నారు.

మెరుగుపడని సర్వర్

- దరఖాస్తుదారుల అవస్థలు



నరసన్నపేట సచివాలయం వద్ద రేషన్ దరఖాస్తుల కోసం వచ్చిన లబ్ధిదారులు

నరసన్నపేట: రేషన్‌కార్డుల కోసం, కార్డుల్లో కొత్త సభ్యుల యాడింగ్ కోసం సచివాలయాలకు వస్తున్న దరఖాస్తుదారులకు సర్వర్ తిప్పలు తప్పడం లేదు. వారాల తరబడి ఇదే పరిస్థితి ఉన్నా.. ప్రభుత్వం మాత్రం సర్వర్‌ను మెరుగుపరచకపోవడంతో సచివాలయాల వద్ద పడిగాపులు కాస్తున్నారు. దరఖాస్తు చేసుకోవాలన్నా.. ఈకేవైసీ చేయించుకోవాలన్నా గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోంది. సర్వర్ మెరుగుపరచండి బాబూ అని దరఖాస్తుదారులు వేడుకుంటున్నారు. కొత్త కార్డులు, కార్డుల్లో పేర్లు యాడింగ్ మాటకేమో గానీ రోజూ సచివాలయాలకు తిరగలేక ఇబ్బంది పడుతున్నామని వాపోతున్నారు. నరసన్నపేట సచివాలయం వద్ద మంగళవారం పలువురు కార్డుదారులు గంటల తరబడి వేచివున్నారు.

2 నుంచి ఆలయ ప్రారంభ మహోత్సవాలు



ఆహ్వానపత్రికను ఆవిష్కరిస్తున్న ఎంపీపీ, ఆలయ కమిటీ ప్రతినిధులు

నరసన్నపేట: జూన్ 2 నుంచి 5వ తేదీ వరకు మండలంలోని అంప్లాం రెవెన్యూ పరిధి రెడ్డికిపేట సమీపంలో హలాహలేశ్వర స్వామి ఆలయ పునః ప్రారంభ మహోత్సవాలు చేపడుతున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు ప్రకటించారు. ఈ మేరకు కమిటీ ప్రతినిధులు, ఎంపీపీ ఆరంగి మురళి, దూకులపాడు, గొట్టిపల్లి సర్పంచ్‌లు అల్లు అసిరినాయుడు, అవ్వ రవీంద్రరెడ్డి, సభ్యులు శిమ్మ లక్ష్మణరావు, షన్ముఖరెడ్డి తెలిపారు. ఆలయం ప్రాంగణంలో మంగళవారం ఆహ్వానపత్రికను ఆవిష్కరించారు. ఎంపీపీ మాట్లాడుతూ ఈ ఆలయానికి ఎంతో చరిత్ర ఉందని శతాబ్దం క్రితం ప్రతిష్ఠించిన ఈ ఆలయం శిథిలం కావడంతో దాతలు ఇచ్చిన రూ.80 లక్షలతో ఆలయాన్ని పునర్ నిర్మించడం జరిగిందన్నారు. ఆలయం ప్రాంగణంలో భవానీ సమేత సుందర మల్లికార్జునస్వామి, నవగ్రహాలు, అభయాంజనేయ విగ్రహం, తదితర విగ్రహాల ప్రతిష్ఠ నిర్వహించనున్నట్లు తెలిపారు. 2వ తేదీ సాయంత్రం తిరువీధితో ప్రతిష్ఠ కార్యక్రమాలు ప్రారంభమవుతాయన్నారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు.

నరసన్నపేటలో భారీ వర్షం



మెయిన్ రోడ్డులో వర్షం నీరు

నరసన్నపేట: మండల కేంద్రంతోపాటు పరిసర గ్రామాల్లో మంగళవారం సాయంత్రం గంట సమయం భారీ వర్షం కురిసింది. నరసన్నపేట పట్టణంలోని వీధులన్నీ జలమయమయ్యాయి. ప్రధాన రహదారికి ఇరువైపులా వర్షం నీరు వరద ప్రవాహంలా కనిపించింది. ఆర్టీసీ కంప్లెక్స్‌లో నీరు చేరింది. గొట్టిపల్లి కూడలి వద్ద నీరు చేరి వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలిగింది. లక్ష్మీ టాకీస్ కూడలి వద్ద మురుగునీరు అధికంగా చేరింది. కోమర్తి, తామరాపల్లి, జమ్ము, గుండవల్లిపేట, దేవాది, రావులవలస, బొరిగివలస, తదితర గ్రామాల్లో వర్షం కురిసింది.

విజయవంతం చేయండి

పాతపట్నం: మండల కేంద్రంలో జూన్ 11 నుంచి 13వ తేదీ వరకు నిర్వహించనున్న సీపీఐ జిల్లా 25వ మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ అన్నారు. ఈ మేరకు మంగళవారం ప్రకటనలో తెలిపారు. విశాఖ ఉక్కు కార్మాగారాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరణ చేయడానికి ఆలోచన చేస్తోందన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించకుండా ప్రైవేట్ వ్యక్తులకు ధారాదత్తం చేయడానికి ప్రయత్నం చేస్తోందన్నారు. శ్రీకాకుళం జిల్లాలో ఐటీడీఏ ఏర్పాటు చేయాలని, గిరిజన గ్రామాలను షెడ్యూల్ ఏరియాలో చేర్పించాలన్నారు.

బదిలీలకు 98 దరఖాస్తులు

హిరమండలం: మండలంలోని ఉపాధ్యాయ బదిలీలకు 98 మంది దరఖాస్తులు చేసుకున్నట్లు ఎంఈఓ కె.రాంబాబు తెలిపారు. ఉపాధ్యాయ బదిలీలకు సంబంధించిన గడువు ముగియడంతో వచ్చిన దరఖాస్తులను మంగళవారం ఎమ్మార్సీ కార్యాలయంలో పరిశీలించారు. అనంతరం డీఈఓ పరిశీలనకు దరఖాస్తులను ఆన్‌లైన్‌లో పంపించారు.

సూక్ష్మ రుణ ప్రణాళికలు రూపొందించాలి



మాట్లాడుతున్న పీడీ సుధాకర్

నరసన్నపేట: గ్రామాల్లో స్వయం శక్తి సంఘాల వారిగా సూక్ష్మ రుణ ప్రణాళికలు రూపొందించాలని డీఆర్‌డీఏ పీడీ బి.సుధాకర్ అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో మండలంలోని సీసీలు, సీఎఫ్‌లతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ప్రతీ గ్రూపులో ఉన్న సభ్యులు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. జూన్ నుంచి ఈ ప్రణాళికల మేరకు రుణ సదుపాయాలు కల్పించడం జరుగుతుందన్నారు. ఎస్సీ మహిళలకు ఉన్నతి రుణాలు ఇవ్వాలని సూచించారు. నరసన్నపేట మహిళా మార్ట్‌లో విక్రయాలు పెంచాలన్నారు. ఏసీ కొండలరావు, ఏపీఎం అప్పలరామయ్య, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు కల్పన, తదితరులు పాల్గొన్నారు.

భూమి శిస్తు డబ్బులు ఏమయ్యాయి?



భూమి శిస్తు రసీదు చూపుతున్న రైతు

సరుబుజ్జిలి: మూడేళ్లుగా తమ భూములకు శిస్తు సక్రమంగా చెల్లిస్తున్నా.. మరలా చెల్లించాలని అధికారులు చెప్పడం విడ్డూరంగా ఉందని పలువురు రైతులు వాపోతున్నారు. మండలంలోని పురుషోత్తపురం గ్రామానికి చెందిన మొదలవలస సన్యాసప్పారావు తన భూమి శిస్తు (ఖాతా నంబర్ 276), చిగురుపల్లి శ్రీదేవి భూమి శిస్తు (ఖాతా నంబర్ 1327), మొదలవలస భారతి శిస్తును అన్ని ఫసలీలకు సంబంధించి మూడేళ్లకు సుమారు రూ.4 వేల చొప్పున చెల్లించినట్లు ఆన్‌లైన్ రశీదులు పొందారు. మరలా ఐదేళ్లకు సంబంధించి రూ.5 వేల చొప్పున బకాయి ఉన్నట్లు అధికారులు చెబుతున్నారని రైతులు వాపోయారు. అసలు తాము చెల్లించిన డబ్బులు ఎవరిచేతికి వెళ్లాయో అంతు చిక్కడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో సుమారు 300 మంది రైతులు ఇదే పరిస్థితి ఎదుర్కొంటున్నారు. అధికారులు స్పందించి సత్వర చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఇదే విషయమై స్థానిక వీఆర్వో రవికుమార్ వద్ద ప్రస్తావించగా.. రైతులు తమ వద్దకు వస్తే వెంటనే పరిశీలించి తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు.

గ్రామ సర్వేయర్లకు అదనపు బాధ్యతలు

కొత్తూరు: మండలంలో పనిచేస్తున్న పలువురు గ్రామ సర్వేయర్లకు వారు పనిచేస్తున్న గ్రామ సచివాలయం పరిధిలో ఉన్న రెవెన్యూ గ్రామలతో పాటు ఇతర రెవెన్యూ గ్రామాలకు అదనపు బాధ్యతలను పరిపాలన దృష్ట్యా అప్పగించినట్లు తహసీల్దార్ కె.బాలకృష్ణ మంగళవారం విడుదల చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. జి.రాజశేఖర్‌ను కడుము, చొంప, కుద్దిగాం గ్రామాలు, జి.వాసుదేవరావుకు బలద, కౌశల్యాపురం, మాతల, వీఎన్‌పురం, పి.రంజిత్‌కు నేరడి, టి.మనోజ్‌కు బమ్మిడి, ఓంద్రుజోల, హెచ్.రత్నాకర్‌కు లబ్బ, అడ్డంగి గ్రామాలను అప్పగించారు. జి.రంజిత్‌కు మెట్టూరు బిట్-1, బిట్-11 ఆర్‌ఆర్ కాలనీ, ఎల్.గిరిరాజుకు ఇరపాడు, జి.మిన్నారావుకు వసప, సందిపాలం, కర్లెమ్మ, టి.యర్రంనాయుడుకు సిరువాడ, కుంటిభద్ర, ఎ.తిరుపతిరావుకు పారాపురం, గూనభద్ర అప్పగించారు. పి.దివ్యకు పెద్దమడి, రీ సర్వేను కోఆర్డినేట్ చేయడంతోపాటు కార్యాలయంలో పలు విధులు నిర్వహించే బాధ్యతలను అప్పగించారు. ఒంద్రుజోల వీఆర్వోగా పనిచేస్తున్న వి.నారాయణరావుకు మదనాపురం గ్రామానికి అదనపు బాధ్యతలను అప్పగించినట్లు తహసీల్దార్ పేర్కొన్నారు.

పరామర్శ..



బాలకృష్ణను పరామర్శిస్తున్న చింతాడ రవికుమార్

బూర్జ: మండలంలోని మామిడివలస గ్రామానికి చెందిన భార్యాభర్తలు సాకేటి బాలకృష్ణ, మామిడి వైష్ణవి ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. రాగోలు జెమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆమదాలవలస నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త చింతాడ రవికుమార్ మంగళవారం ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు. పరామర్శించిన వారిలో పార్టీ ఇంటిలెక్చువల్ ఫోరం అధ్యక్షుడు కొప్పల ఈశ్వరరావు, సాకేటి శ్రీనివాసరావు, నవీన్, ఢిల్లేశ్వరరావు, రామ్మోహన్ తదితరులు ఉన్నారు.

భజన కళాకారుడి మృతికి సంతాపం



చిన్నప్పలనాయుడు (ఫైల్)

పొందూరు/పొందూరు రూరల్: పొందూరు పంచాయతీలోని లక్ష్మీపేట గ్రామానికి చెందిన భజన, కీర్తన కళాకారుడు, శ్రీరామ యువజన సేవా సంఘం అధ్యక్షుడు మొకర చిన్నప్పలనాయుడు (46) మంగళవారం గుండెపోటుతో మృతి చెందారు. మృతుని భార్య ఆశ కార్యకర్తగా పని చేస్తున్నారు. ఇద్దరు పిల్లలు ఉన్నారు. స్వచ్ఛంద సేవా కార్యక్రమాల్లో ముందుండేవారని గ్రామస్తులు గుర్తు చేసుకుంటున్నారు. ఆయన మృతి పట్ల కళాకారులు, ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులు సంతాపం వ్యక్తం చేశారు.

పైపులైన్ లీక్



జలుమూరు మండలంలోని శ్రీముఖలింగం రక్షిత మంచినీటి పథకం నుంచి అల్లాడ, అల్లాడపేట, సైరిగాం గ్రామాలకు తాగునీరు అందించే పైప్‌లైన్ తిమడాం బీటీ రోడ్డు వంతెన కింద లీకైంది. తాగునీరు పూర్తి స్థాయిలో రావడం లేదని ఆయా గ్రామస్తులు చెబుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి పైపులైన్‌ను బాగుచేయాలని కోరుతున్నారు. దీనిపై గ్రామీణ నీటిసరఫరా విభాగం ఏఈ మౌళి వద్ద ప్రస్తావించగా.. తిమడాం వద్ద పైపులైన్ మరమ్మతులు చేసి పూర్తిస్థాయిలో తాగునీరు అందిస్తామన్నారు. - జలుమూరు

చెరువుకాదు.. రోడ్డే..



కొత్తూరు మండల కేంద్రంలోని కాలేజీ రోడ్డులో (ఏబీ రోడ్డు) ఏర్పడిన గోతులు చెరువులను తలిపిస్తున్నాయి. ఈ గోతులు దాటలేక పలువురు వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. మంగళవారం ఈ గోతులు దాటుతుండగా ఓ వ్యక్తి స్కూటీ పైనుంచి జారిపడి పడిపోయిన ఘటన జరిగింది. అధికారంలోకి వచ్చిన వెంటనే రోడ్లను బాగు చేస్తామని కూటమి నేతలు చెప్పిన మాటలకు చేతలకు పొంతనలేదని వాహనదారులు మండిపడుతున్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు వెంటనే గోతులను పూడ్చి రోడ్డును బాగుచేయాలని కోరుతున్నారు. - కొత్తూరు

నిర్లక్ష్యం..



ఈ చిత్రం సారవకోట మండల కేంద్రంలోని కూరకుల వీధిలో తవ్విన రోడ్డు. మండల కేంద్రంలో జల్ జీవన్ మిషన్ పథకం ద్వారా ఇంటింటికీ కుళాయి వేసేందుకు రోడ్డు తవ్వకాలు చేపట్టారు. నిర్లక్ష్యంగా తవ్వకాలు చేపట్టడంతో మురుగు నీటి కాలువలు విరిగిపోయాయి. రోడ్డు వ్యర్థాలు తిరిగి కాలువలో పడిపోయాయి. మురుగునీరు వెళ్లకపోవడంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. పైపులైన్ పనులు పూర్తిస్థాయిలో చేపట్టలేదు. మురుగు నీరు నిల్వ ఉండి ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఆరోపిస్తున్నారు. - సారవకోట

అప్రమత్తతే ఔషధం



పశువులు

- అజాగ్రత్త వహిస్తే పశువుల ప్రాణాలకే ముప్పు
- వర్షా కాలంలో అంటు వ్యాధులు ప్రబలే అవకాశం
- అవగాహన కల్పిస్తున్న పశుసంవర్థకశాఖ సిబ్బంది

సరుబుజ్జిలి: ప్రస్తుతం అడపాదడపా వర్షాలు కురుస్తున్నాయి. భారీ వర్షాలకు గోతుల్లో నీరుచేరుతుంది. పశువులకు అనేక రకాల అంటువ్యాధులు ప్రబలే ప్రమాదముంది. సీజనల్‌గా వచ్చే వ్యాధుల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని పశుసంవర్ధకశాఖాధికారులు సూచిస్తున్నారు.

చిటుకు వ్యాధి..

గొర్రెల్లో చిటుకు వ్యాధి అధికంగా వస్తుంది. ఇది బ్యాక్టీరియావలన వస్తుంది. ఉన్నట్టు ఉండి గాలిలో ఎగిరి గొర్రెలు చనిపోతాయి. ముందుగా నీరసంగా ఉన్న గొర్రెలను మంద నుంచి వేరుచేయాలి. వ్యాధి నివారణకు పెన్సిలిన్ వేయించాలి. వ్యాధి సోకిన వాటికి వ్యాక్సిన్ వేయించాలి.

నీలినాలుక..

నీలినాలుక గొర్రెలు, మేకల్లో వస్తుంది. ఈ వ్యాధి సోకిన జీవాలకు జ్వరంగా అధికంగా ఉంటుంది. నోటి నుంచి సొంగ కారుస్తూ, గిట్టలకు పుండ్లు ఏర్పడతాయి. ఈ వ్యాధి నివారణకు యాంటీ బయాటిక్స్, లివర్‌టానిక్ ఉపయోగించి జీవాలను వేరుచేయాలి.

గొంతువాపు వ్యాధి..

గొంతువాపు వ్యాధి అన్ని వయస్సుల ఆవులు, గేదెల్లో కనిపిస్తుంది. 105 నుంచి 108 డిగ్రీల జ్వర వస్తుంది. నోటి నుంచి సొంగలు కారి, నోటి నుంచి గాలిపీల్చుకొంటాయి. గొంతవద్ద వాపు వలన మేత తీసుకోలేవు. నివారణకు సల్ఫాడిమిడిన్ వాడాలి. 4 నెలలు దాటిన జీవాలకు వ్యాక్సినేషన వేయించాలి.

గాలికుంటువ్యాధి..

ఇది అన్ని జీవాల్లో కనిపిస్తుంది. నోటి, గిట్లలో పుండ్లు, ఎక్కువగా జ్వరం ఉంటుంది. నివారణకు బోరిక్‌గ్లిజరిన్ ఆయింట్‌మెంట్‌ను నోటిలో పూతపూయాలి. పీపీ ద్రావణంతో కాలిగిట్ల మధ్య కడగాలి. ప్రతి ఏటా ముందస్తుగా ఏప్రిల్, మే నెలల్లో వ్యాక్సిన్ వేయించాలి.

ఆమదాలవలస నియోజకవర్గంలో పశుసంపద వివరాలు..

మండలం	ఆవులు	గేదెలు	గొర్రెలు	మేకలు
సరుబుజ్జిలి	9,480	88	9,456	4,059
పొందూరు	14,834	596	24,412	8,241
బూర్జ	10,560	38	11,658	2,542
ఆమదాలవలస	11,054	664	11,842	2,910

ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి



రైతులు దాణా అందుబాటులో ఉంటుకోవాలి. తడిచిన దాణా వినియోగించకూడదు. పశువుల షెడ్లు పరిశుభ్రంగా ఉంచాలి. వర్షాలు, వరదల సమయంలో జంతువులు చనిపోతే కాల్చడం, పూడ్చడం చేయాలి. ఆర్ఎస్‌కేలకు అనుసంధానంగా ఉన్న విలేజ్ పశువైద్య సహాయకుల ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం.

– సి.హెచ్.సుబ్రహ్మణ్యం, సహాయసంచాలకులు, పశుసంవర్ధకశాఖ